ప్రజాశక్తి

శుక్రవారం 14 మార్చి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

లక్ష్యం ఘనం.. కేటాయింపులు హీనం..

- మధ్యాహ్న భోజన పథకానికి పెరగని మెనూ ఛార్జీలు
- మెనూ మార్పులతో కార్మికులపై అదనపు భారం
- నెలల తరబడి వేతనాలు, బిల్లులు పెండింగ్
- 18న రాష్ట్రవ్యాప్త ధర్నాకు పిలుపు



ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యలో బడి మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవటం వల్ల ఆహారంలో నాణ్యత తగ్గిపోతుంది. పొమ్మనకుండా పొగబెడుతున్న చందంగా ప్రభుత్వాల వ్యవహార శైలి ఉంది. సన్నబియ్యం సరఫరా హామీ అమలు కావట్లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవటంతోపాటు కార్మికుల వేతనాలు, బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. వీటికి తోడు ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ వేధింపులు అధికం అవుతున్నాయి.

గుంటూరు జిల్లాలో 2117 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పని చేస్తున్నారు. మంగళగిరి ప్రాంతంలో అక్షయపాత్ర, తెనాలిలో ఇస్కాన్ వారు పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఆయా సంస్థలు కోడిగుడ్డును వండి పెట్టట్లేదు. ప్రభుత్వాలు మారినప్పుడు వారి మార్క్ చూపించుకోవటానికి కొత్త మెనూ ప్రకటిస్తున్నారు. కానీ అందుకు అనుగుణంగా మెనూ ఛార్జీలు మాత్రం పెంచట్లేదు. నాణ్యత లేకపోవటం వల్ల మధ్యాహ్న భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది. రికార్డుల్లో భోజనం చేసే వారి సంఖ్య బాగున్నా వాస్తవ పరిస్థితుల్లో సగం మంది కూడా తినట్లేదు. నాణ్యత లేకపోవటమే ఇందుకు కారణమని తల్లిదండ్రులు అంటున్నారు. రోడ్డుపక్కన బండిలో ఇడ్లీ

▶ 2లో

బడ్జెట్ పెంచాలి



దండా లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పథకానికి బడ్జెట్ పెంచాలి. నాణ్యమైన ఆహారం అందించటానికి ప్రతి విద్యార్థికి కనీసం రూ.20 కేటాయించాలి. బిల్లులు సకాలంలో చెల్లించకపోవటంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారు. సకాలంలో బిల్లులు వేతనాలు ఇవ్వాలి. కార్మికులకు కనీసం రూ.10వేలు జీతం ఇవ్వాలి. ముఖ్యంగా జిల్లాలో రాజకీయ వేధింపులు మానుకోవాలి. తమ వారిని నియమించుకునేందుకు ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని తొలగించటం సరికాదు.

ప్రభుత్వ అనుమతితోనే లాకౌట్

- కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యతా ప్రభుత్వానిదే
- ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల 100వ రోజు దీక్షలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



100వ రోజు దీక్షను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- తాడేపల్లి

ప్రభుత్వ అనుమతితోనే ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ 35 ఏళ్ల క్రితం అక్రమ లాక్ అవుట్ గురైందని, ప్రభుత్వమే బాధ్యత వహించి కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నష్టపరిహారం కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం 100 రోజులకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని ప్రభాకర్‌రెడ్డితో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ప్రారంభించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల పేరుతో పెద్దలకు సిఎం వేలాది ఎకరాలు కట్టబెడుతున్నారని, కర్నూలు జిల్లాలో ఆదోని దగ్గర, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కంపెనీలకు సోలార్ ఎనర్జీ పేరుతో ఐదు లక్షల ఎకరాలు కట్టబెడుతున్నారని అన్నారు. రైతులను భూముల నుండి వెళ్లగొట్టటానికి ప్రభుత్వం యత్నిస్తోందని దుయ్యబట్టారు. సిమెంట్ ఫ్యాక్టరీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని, గత కోర్టు తీర్పులు అమలు బాధ్యతా ప్రభుత్వం దేనని స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వం రాజధానిలో ఇచ్చిన స్థలాలను రద్దుచేసి వారి వారి స్వస్థలాలు ఇంటి స్థలాలు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం, ఇక్కడ నివాసం ఉంటున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎందుకు స్థలం ఇవ్వటం లేదని ప్రశ్నించారు. నేతాజీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో ఓట్ల అభ్యర్థిస్తూ

▶ 2లో

మద్దతు ధరలకు రబీ పంటలకొనుగోలు : జెసి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో పండించిన మినుములు, శనగలు, పెసలు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుములకు రూ.క్వింటాళ్‌కు రూ.7400లు, శనగలు రూ.5650లు, పెసలు రూ.8682లు కనీస మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించదలుచుకుంటే ఈనెల 15వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తలపై కృష్ణమ్మ.. గొంతు తడవదేవమ్మ..!

- వేసవిలో గొంతెండే గ్రామాలెన్నో..
- శాశ్వత పరిష్కారం కోసం దశాబ్దాలుగా నిరీక్షణ
- నీటి మూటలవుతున్న హామీలు



మాచర్ల పట్టణ శివారులో ట్యాంకర్ల వద్ద నీరు పట్టకుంటున్న మహిళలు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జున సాగర్ జలాశయం మాచర్ల నియోజకవర్గంలో ఉన్నా ఇక్కడ అనేక గ్రామాలు సాగు, తాగునీటికి అల్లాడుతున్నాయి. ప్రాజెక్టు నుండి కృష్ణమ్మ ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో వందల కిలోమీటర్లు ప్రయాణించి లక్షల ఎకరాల సాగుకు, వేల గ్రామాల తాగునీటి అవసరాలు తీరుస్తుంది. కానీ మాచర్ల ప్రాంత ప్రజలు మాత్రం పారుతున్న ఆ నీటిని చూస్తూ నిస్సహాయులవుతున్నారు. ప్రతి వేసవి లోనూ మాచర్ల నియోజకవర్గంలోని పలు గ్రామాలు దప్పికతో అలమటిస్తుంటాయి. తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. సమస్య తీవ్రంగా వుండే ఆ రెండు మూడు నెలలుపాటు తాత్కాలిక సర్దుబాటు చర్యలతో సరిపెడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపటం లేదు.

మాచర్ల నియోజకవర్గంలోని కారంపూడి, రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాలలోని పలు గ్రామాలు, మాచర్ల పట్టణం శివారు ప్రాంతాలు వేసవి కాలంలో తాగునీటి సమస్య అధికంగా ఉంటుంది. తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి తీసుకొచ్చుకోవాల్సి వస్తుంది. వేసవిలో నాగార్జున సాగర్ కుడి కాలువ నీరు నిలిచిపోవటం, చెరువులు ఎండి, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పనిచేయకపోవటంతో నీటి కష్టాలు మొదలవుతాయి. 800 నుండి 1200 అడుగుల లోతున బోర్లు వేస్తే గానీ నీరు లభ్యం అవ్వదు. అదీ కూడా కొనిచోట్లే. దీనికి తోడు కరెంటు కోతలు, లోవోల్టేజ్ సమస్యలతో బోర్లు నడవక భూమిలోని నీరు పైకి రాక ఇబ్బందులు పడుతుంటారు. కొన్నిచోట్ల తాగునీటి పైపులైన్లు సరిగా లేక, నీటి ఓవర్‌హెడ్ ట్యాంకులున్నా నిరూపయోగంగా మారాయి. పురపాలక, గ్రామీణ నీటి సరఫరా అధికారులు తాగు నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు పట్టుకోవటానికి ప్రజలు యుద్ధాలు

▶ 2లో


కళ్యాణానికి శరవేగంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీనివాస కళ్యాణాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణంలో సిఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, రాజధాని రైతులు, వివిధ గ్రామాలు, ప్రాంతాల నుండి ప్రజలు పాల్గొంటారని తెలిపారు. టిటిడి ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ కళ్యాణాన్ని 27 వేల మంది తిలకించేందుకు వీలుగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. టిటిడి

▶ 2లో

ఏర్పాట్ల పరిశీలనలో మంత్రులు





రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.23 (శుక్రవారం - సాయంత్రం)

సహర్ : 5.00 (శనివారం - ఉదయం)



కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం కేశానుపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం స్థలాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్ గురువారం పరిశీలించారు. పొలాలకు సమీపంలోని ప్రభుత్వ స్థలం విద్యాలయం ఏర్పాటుకు అనుకూలమా కదా అని అధికారులతో మాట్లాడారు.

ప్రజాశక్తి - నాదెండ్ల : మండలంలోని సాతులూరులో 544-డి (గుంటూరు-కర్నూలు రోడ్డు వైడనింగ్) కోసం పొలాలను జెసి పరిశీలించారు వినుకొండ నుండి గుంటూరుకు నాలుగు లైన్ల రోడ్డు సంబంధించి సాతులూరు వద్ద బైపాస్ నిర్మించేందుకు ఈ పరిశీలన చేపట్టారు.



ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఎంపీ శంకుస్థాపన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా రూ.4.50 లక్షలతో నిర్మితమయ్యే ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జిల్లాలో క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు.



కిడ్నీ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - మాచర్ల : ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం మాచర్ల కమ్యూనిటీ వైద్యశాల నందు డయాలసిస్ యూనిట్ ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ ఎ.ఉదయభాను, డాక్టర్ కెపి చారి, డాక్టర్ కె.జయప్రకాష్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మద్యం సేవించరాదని, పెయిన్ కిల్లర్స్ వాడరాదని, పరిశుద్ధమైన నీటిని ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. షుగర్ బీపీ ఉన్నవాళ్ల ప్రతినెలా క్రియాటిన్ టెస్ట్ చేయించుకోవాలన్నారు.

'కృష్ణవేణి' విద్యార్థులకు టిసిఎస్‌లో ఉద్యోగాలు



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాలలో గత నెల 18న బీకాం విద్యార్థులకు ఐటి బహుళజాతి కంపెనీ టిసిఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు 15 మంది ఉద్యోగాలు సాధించారని నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఇన్ఫోసిస్, టిసిఎస్ వంటి దిగ్గజ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నట్లు చెప్పారు. ఎంపికైన వారిని టిపిఎ ఎం.బాలకోటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, జి.శివన్నారాయణ అభినందించారు.

తలపై కృష్ణమ్మ.. గొంతు తడవదేవమ్మ..!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూంటారు. మాచర్ల నియోజకవర్గంలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించి శాశ్వతంగా తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానం చేస్తుంటారు. నీటి సమస్య పరిష్కరించకుంటే శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకుంటామంటూ భీషణ ప్రతిజ్ఞలు చేసినా ఎప్పటి లాగే ప్రజలు తాగునీటి కష్టాలతో అల్లాడిపోతున్నారు.

కలగానే వరికెపూడిసెల పథకం..

సాగు, తాగు అందించే వరికెపూడిసెల ఎత్తిపోతల పథకం ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల. మాచర్ల ప్రాంతంలో నీటి కష్టాలు తీరాలంటే వరికెపూడిశెల, బుగ్గవాగు రిజర్వాయర్ వాటర్ స్కీం పథకాలు పూర్తవ్వాలి. అయితే దశాబ్దాలుగా పథకాన్ని పూర్తిచేయటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ కారణంగా మాచర్ల ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు అధికంగా ఉంటాయని, అందువలన ఈప్రాంత ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు వరికెపూడిశెల ఎత్తిపోతల పథకం అవసరమని కోస్లా కమిటీ చెప్పింది. అయితే పథకానికి మాత్రం మోక్షం లభించలేదు. ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపనలు కూడా చేశారు. ఇటీవల కాలంలో కొంత కదలికలు వచ్చి, అటవీశాఖ అనుమతులు లభించాయి. అయితే మొదటి ఫేజ్ కింద రూ. 500 కోట్లతో చేపట్టే వరికెపూడిశెల ప్రాజెక్టు ఈ ఏడాది కూడా ముందుకు వెళ్లని పరిస్థితి కనపడుతోంది. ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.15 కోట్లే కేటాయించింది. ఈ పథకం పూర్తిఅయితే వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాలలో సాగు, తాగునీరు ఇబ్బందులు తొలిగిపోతాయి.

బుగ్గవాగు మంచినీటి పథకం పూర్తయ్యేనా...

బుగ్గవాగు రిజర్వాయర్ త్రాగునీరు స్కీం 2005లో శంకుస్థాపన జరిగింది. మాచర్లకు 13.6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్ నుండి పైపు లైన్ల ద్వారా మాచర్ల పట్టణానికి తాగునీటికి అందించి శాశ్వతంగా తాగునీరు సమస్యను పరిష్కరించాలని ఈ పథకాన్ని రూపొందించారు. ప్రాజెక్టు మొదలై కొంత పనులు జరిగి నిలిచిపోయింది. 2009లో సవరించిన అంచనాలతో తిరిగి ఇదే పథకానికి రూపకల్పన చేశారు. అందులో భాగంగా సుమారు కోటి రూపాయల వ్యయంతో స్థానిక పిడబ్ల్యూడీ కాలనీలోని హైస్కూల్ మైదానంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. తరువాత పనులు నిలిచిపోయాయి. తిరిగి 2023లో రూ. 84.71 కోట్ల సవరించిన అంచనాలతో పథకం రూపరేఖలు మార్చి శిలా ఫలకం వేశారు. ఈ ప్రయత్నం కూడా శిలాఫలకంతోనే నిలిచిపోయింది.

జలజీవన్ పథకంతోనైనా పరిష్కారం లభించేనా..



బుగ్గవాగు మంచినీటి పథకంలో భాగంగా రూ.కోటితో మాచర్ల పట్టణంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

జలజీవన్ పథకం ద్వారా పల్నాడు ప్రాంతంలోని ఇంటింటికి కుళాయి ద్వారా త్రాగునీరు అందించి శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ పథకం కింద పల్నాడు ప్రాంతానికి రూ.600 కోట్లు కేటాయించారని, త్వరలోనే పనులు మొదలుపెట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నారు. ఐదు మండలాలకు చెందిన గ్రామాల్లో వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు. నీటి ఎద్దడి తలెత్తిన గ్రామాల్లో పంచాయితీ నిధులతోనే బోర్లు మరింత లోతు తవ్వేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. బోర్లు పనిచేయని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. జలజీవన్ పథకం పూర్తియితే త్రాగునీటి కష్టాలు శాశ్వతరంగా తీరుతాయని అధికారులు అంటున్నారు.

లక్ష్యం ఘనం.. కేటాయింపులు హీనం..

(మొదటి పేజీ తరువాయి)

తినాలన్నా రూ.20 కావాలి. కానీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి ఇస్తుంది మాత్రం రూ.10 లోపే. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.6.19, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.9.29 ఇస్తోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవంబర్‌లో మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేసి, హైస్కూల్ విద్యార్థులకు రూ.48పైసలు, ఎలిమెంటరీ విద్యార్థులకు రూ.32 పైసలు బడ్జెట్ పెంచారు. అయితే పెంచిన బడ్జెట్ ఐదు నెలలు కావస్తున్నా ఇంత వరకూ అమలు చేయలేదు. పెరిగిన భారం ఇప్పటికే కార్మికులు భరిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో కార్మికుల జీతాలు నాలుగు నెలలుగా, బిల్లులు మూడు నెలలుగా పెండింగ్ ఉన్నాయి. ఇచ్చే రూ.3వేల జీతం కూడా సకాలంలో ఇవ్వట్లేదని కార్మికులు వాపోతున్నారు. జీతాలు, బిల్లులు సకాలంలో ఇవ్వక, బడ్జెట్ పెంచకపోవటంతో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగిపోయి నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. అప్పులు పెరిగిపోతున్నాయని, వడ్డీలకు తెచ్చి ఖర్చు చేయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. కోడిగుడ్డు ఉడికిస్తే విద్యార్థులు తినట్లేదని ఫ్రై చేసి పెట్టాలని గతనెల రోజులుగా ప్రభుత్వం చెబుతోంది. అయితే అందుకు అవసరమైన ఆయిల్, ఉల్లిపాయలు, ఇతర సరుకులకు మాత్రం బడ్జెట్ కేటాయించలేదు. మెనూలో జావ ఇవ్వాలని చెబుతున్నారు. దానికి బడ్జెట్ పెంచలేదు. ఈ అదనపు భారాలను కార్మికులే భరిస్తున్నారు.

దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు పెరిగాయి. 9నెలల్లో దాదాపు 122 మందిని మధ్యాహ్న భోజన కార్మికుల్ని తొలగించారు. ఈ నేపథ్యంలో వేతనాలు, బడ్జెట్ పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈనెల 18న ఛలో విజయవాడ కార్యక్రమం తలపెట్టారు. పథకానికి బడ్జెట్ పెంచాలని, జోనల్ వారీగా మెనూ రద్దు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మెనూ అమలు చేయాలని, ధరల పెరుగులదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు కనీసం రూ.20లకు పెంచాలని, ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు, బిల్లులు జమ చేయాలని, ప్రైవేటు సంస్థలకు పథకాన్ని అప్పగించొద్దని, రాజకీయ వేధింపులు ఆపాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు.

చులకన చేసి మాట్లాడుతున్నారని, తాడోపేడో తేల్చుకోటానికి కార్మికుల సిద్ధం కావాలని అన్నారు. ఎఐఎఫ్‌టియు నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ టియు నాయకులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంపై కార్మికుల పెట్టుకున్న ఆశలు అడియాస లేయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు డి.రమేష్, సిహెచ్ సుబ్బారావు, సిహెచ్.మల్లేశ్వరరావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతితోనే లాకౌట్

(మొదటి పేజీ తరువాయి)

తనను గెలిపిస్తే సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ బాధలు చెప్పుకోవటానికి కార్మికులు వెళ్తే బయటికి గెంటేసి గేట్లు వేస్తానని బెదిరించడం ఏమిటన్నారు. హైదరాబాదులోనే సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు ఆర్డర్ ఇచ్చి, కార్మికులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చిందంటే, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? అని నిలదీశారు. తాడేపల్లి మంగళగిరి ప్రాంతంలో సుమారు 20 వేల మంది ఇళ్ల స్థలాలు లేని వారున్న సంగతిని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వగా, మిగిలిన భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సూచించారు. ఈ సమస్యలను పట్టించుకోకుంటే ప్రభుత్వానికి నష్టం తప్పదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్‌రావు, సిపిఎం సీనియర్ నాయకులు డి.వెంకటరెడ్డి, సిపిఎం రూరల్ కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ వందరోజులపాటు దీక్షలు పూర్తి చేసుకున్న ముఖ్యంగా మహిళలకు అభినందనలు తెలిపారు. కార్మికుల్లో చీలికలు లేవటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అప్రమత్తంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ కాదని మంత్రి లోకేష్ ప్రకటించడం దుర్మార్గమన్నారు. 300 కుటుంబాలతో ముడిపడిన సమస్యను మంత్రి

కళ్యాణానికి శరవేగంగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిఘా,భద్రతా విభాగం నుండి 160 మంది, గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం నుండి 600 మందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. ఐదు డ్రోన్లు, 70 సీసీ కెమెరాలను భద్రత, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేశామన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వివిఐపిల కోసం 400 వాహనాలకు, ఆలయం కాంపౌండ్ వాల్ వెనుక వెయ్యి వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించామని, సీడ్ యాక్సిస్ రోడ్డు దక్షిణం వైపు 1500 వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించామని వివరించారు. వచ్చేవారికి తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయంతో పాటు కళ్యాణ వేదిక,పరిసరాలు, పార్కింగ్ స్థలాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచడానికి వందమంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశామని, కళ్యాణ వేదిక పరిసరాల్లో దాదాపు వంద మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేకంగా రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారికి ఆర్టీసీ సహకారంతో 310 బస్సులతో రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ,ఎం శాంతా రామ్, ఎం ఎస్ రాజు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కళ్యాణం ఏర్పాట్లను మంత్రుల బృందం పరిశీలించింది. వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, నారాయణ, సవిత, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పి సతీష్ కుమార్ తదితరులు పరిశీలించిన వారిలో ఉన్నారు.

కళ్యాణం వేడుకలకు వ్యవధి తక్కువగా ఉండడంతో రాత్రివేళల్లోనూ కార్మికులు పనులు శరవేగంగా చేస్తున్నారు. సభా ప్రాంగణం వద్ద భూమిని చదును చేయడం, విద్యుత్ సరఫరాకు అవాంతరాలు ఏర్పడకుండా ట్రాన్స్‌ఫర్లు ఏర్పాటు లాంటి పనులు వేగం పుంజుకున్నాయి. 25 ఎకరాల్లో ఆలయం చుట్టూ రెండు వరుసలుగా మొక్కలు నాటుతున్నారు.12,13 అడుగుల ఎత్తు ఉండే 3,600 మొక్కలను నాటే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు. వేడుకలు ముగిశాక మొక్కల సంరక్షణ టిటిడి చేపట్టనుంది.



మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న కార్మికులు

ప్రభుత్వ పథకాలతో ఎంతమంది లబ్ది పొందారో నివేదిక ఇవ్వండి

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు ఎంత మంది లబ్దిదారులుకు, ఏయే బ్యాంకు ఎంత రుణాలు ఇచ్చాయో పూర్తి నివేదికలు రూపొందించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయులు సంబందిత లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరు రాంప్రసాద్‌ను కోరారు. గురువారం కలెక్టరేట్ లో 2024 త్రైమాసికానికి సంబంధించి డి.సి.సి (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటి) డి.ఎల్.ఆర్.సి (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటి) పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ లుగా మండలాలలో ఒక బ్యాంక్ ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎంపి

తద్వారా మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని లబ్దిదారులకు సులభంగా పథకాలపై అవగాహన కల్పించి, లబ్ది చేకూర్చాలన్నారు. పిఎంజెజెవై పిఎం జన్‌ధన యోజన వంటి పదకాలలో ఎన్ని యాక్టివ్‌గా ఉన్నాయి, ఎన్ని ఇన్ యాక్టివ్‌గా ఉన్నాయో అనే వివారాలను అడిగి తెలుసుకున్నారు. విశ్వకర్మ యోజన పథకం క్రింద శిక్షణ పొందిన వారికి రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. లైజేన్ ఆఫీసర్ నియామకంతో బ్యాంక్ అధికారులు పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకర్లు తమ పరిధిలో వ్యవసాయ పొలాలలో రోడ్లు వేయడం సిఎస్.ఆర్ నిధులు అందేలాచూడాలన్నారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ టి.మాధురి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాంప్రసాద్, ఆర్.బి.ఐ అధికారి సిహెచ్. నవీన్, నాబార్డు డిడిఎంసి శరత్ బాబు పాల్గొన్నారు.

జాబ్ డ్రైవ్‌లో 24 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట కార్మిక శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఎన్ ఏ సి ట్రైనింగ్ సెంటర్ వద్ద గురువారం జాబ్ డ్రైవ్ ను నిర్వింహించినట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజిరావు తెలిపారు. ఈ డ్రైవ్‌కు 49 మంది హాజరు కాగా అందులో 24 మంది ఉద్యోగాలకు ఏంపికయ్యా రన్నారు. జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ డిఇఓ రమాదేవి హాజరై మాట్లా డారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ వారు ఈ జాబ్ మేళను నరసరావుపేటలో నిర్వహించడం సంతోషకరంఅన్నారు. నియా మక పత్రాలు అందుకున్న యువతకు అభినందలు తెలిపారు. నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ సిబ్బంది, నరసరావుపేట స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.వీరాంజ నేయులు, ఎ. రమ్యా కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, సీడాప్ పిఓ నాగుల్, రాజు, వైపిఇ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొల్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మొల్లమాంబజయంతి వేడుకలు శ్రీ వెంకటేశ్వర సాయి శాలివాహన కమ్మ సంఘం పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.పట్టణంలోని జడ్పీ హైస్కూల్ దగ్గర ఉన్న శాలివాహన చక్రవర్తి విగ్రహం వద్ద సంఘ ప్రెసిడెంట్ పొద్దుటూరి గురుప్రసాద్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి ప్రారంభించారు. అతిధులుగా విచ్చేసిన పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మొల్లమాంబ జీవిత చరిత్ర గురించి వివరించారు. అనంతరం 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని ట్రెజరర్ కానాల వెంకటేష్ ప్రారంభించారు. కార్యక్రమానికి పట్టణ, పరిసరాల గ్రామాల నుండి ప్రజలు పాల్గొన్నారు.



'మొల్ల'కు నివాళి అర్పిస్తున్న కమ్మ సభ్యులు

బాల, బాలికలు రక్షణ కవచంగా పోక్సో చట్టం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

ఫోక్సో చట్టం బాల బాలికలు లైంగిక వేధింపులకు గురికాకుండా రక్షణ కవచంగా నిలుస్తుందని సత్తెనపల్లి మండల న్యాయ సేవ అధికారి కమిటీ చైర్మన్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.విద్యార్థినులకు లైంగిక వేధిం పుల నిరోధక చట్టం 2012పై విజయ్‌కుమార్ రెడ్డి అవగాహన కల్పిం చారు. న్యాయమూర్తి సొంత నగదుతో 40 మంది 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది బాలిసైద,ప్యానల్ న్యాయ వాదులు బి.ఎల్.కోటేశ్వం ్రావు, గంటా వెంకట శివ, పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది విజయ్‌కుమార్‌రెడ్డి

వినూత్నంగా జనసేన లోగో



జనసేన లోగోతో బాపారావు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు యర్రు బాపారావు రాష్ట్ర డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో తనకంటూ ఒక ప్రత్యేకతను తెచ్చుకున్న బాపారావు ప్రతియేటా పంటలను బొమ్మలుగా మలిచి ప్రయోగాలు చేస్తూ ఉంటారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన వ్యవసాయ క్షేత్రంలో జనుము ఎర్రతోట, కూరగాయ మొక్కలతో జనసేన లోగోతో పాటు హండ్రెడ్ పెర్సెంట్ స్ట్రైక్ రేట్ పేర్లను మొలకెత్తించి అందరిని ఆశ్చర్యపరిచారు. అనంతరం కనకదుర్గ, గాంధి, జనసేనలోగో, ప్రకృతి వ్యవసాయంలోగోలను ఆకుకూరలు, వరి, ప్రకతి వ్యవసాయ పంటలతో బొమ్మలుగా మలచి చూపరులను అబ్బుర పరిచారు. తాము రూపొందించిన లోగోని పవన్ కళ్యాణ్‌కి జనసేన పార్టీ శ్రేణులకు, వీర మహిళలకు అంకితమిస్తున్నట్టు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

నూకల వెంకటేశ్వరరావు, తండ్రి : నూకల ఆదిశేషయ్య, గుంటూరుజిల్లా, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం కాపురస్తులు డోర్ నెం. 5-45 నివాసం నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పొందిన ప్రత్తిపాడు గ్రామ **డి.నెం. 761/ఎ, విస్తీర్ణం 41.5 చ॥గ॥ల దస్తావేజు నెం. 2029/2015** గల స్థలానికి సంబంధించి ఒరిజినల్ దస్తావేజు ది. 6-3-2025న ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రారు ఆఫీసుకు లింకు దస్తావేజులకోసం వెళ్ళి తిరిగి వచ్చుచున్నప్పుడు సదరు ఒరిజినల్ దస్తావేజులు మార్గమధ్యంలో ఎక్కడో జారిపడిపోయినవి. వెనుతిరిగి ఎంత వెదికినా దొరకలేదు. కావున దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
నూకల వెంకటేశ్వరరావు,
సెల్ నెం. 99481 39465.

హాల్‌టికెట్ చూపిస్తే ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు స్థానిక తెనాలి ఆర్టిసి డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ గురువారం ప్రకటన విడుదల చేసారు. మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు ఏ విధమైన బస్సు పాసులు లేకపోయినా హాల్ టికెట్ చూపించి బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణాన్ని పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు దృష్ట్యా పది పరీక్షలు జరిగేవరకు విద్యార్థులకు సహకరించాలని సిబ్బందిని ఆదేశించారు.

మిర్చి రైతుకు సకాలంలో సాగునీరు ఇవ్వండి : ఆర్కే

ప్రజాశక్తి - అమరావతి

మిర్చి పంటకు సాగునీరు ఎంతో అవసరమని తెలుగు జనసేన సమితి అధ్యక్షులు ఆర్కే యాదవ్ అన్నారు. గురువారం ఆయన పలు మిరప తోటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా నీటిని సకాలంలో వదిలి మిర్చి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీరు లేక మిరప తోటలు ఎండు ముఖం పట్టాయని కాయల్లో నీటి శాతం తగ్గితోటలు వాడిపోతున్నాయనీ, మిర్చి రైతులను ఆదు కోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన సర్పంచ్

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షల అట్టలు , పెన్నులు . నందిగామ సర్పంచి బలిజేపల్లి రమాదేవి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజేపల్లి విజయ్ కుమార్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

70 మంది ఉద్యోగాలు ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల :

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఈ. తమ్మాజి రావు తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ కళాశాల నందు జాబ్ డ్రైవ్ నిర్వహించారు. జాబ్ మేళా కు 5 కంపెనీలు హాజరై 118 మందిని ఇంటర్యూలు చేసి 70 మందిని ఉద్యోగాలకు ఏంపిక చేశాయి. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి కుమారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ వారు జాబ్ మేళను మాచర్లలో నిర్వహించడం సంతోషమన్నారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి యం. రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్. కిరణ్ నాయక్, సీడాప్ జాబ్స్ కోఆర్డినేటర్ నని నాయక్, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శనగ అమ్ముకోవాలంటే నమోదు చేసుకోడి : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : శనగపంటను ఈ-క్రాప్‌లో చేయించుకున్న రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పంటను ఎపి మార్క్‌ఫెడ్, జాతీయ సంస్థ నాఫెడ్ తరపున కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో 20,700 ఎకరాల్లో రైతులు శనగ పంట సాగు చేశారని, 16,500 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాళ్‌కు రూ.5650 మద్దతు ధరకు పంటను కొంటారని, అమ్ముకునే రైతులు ఈనెల 15 లోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న బండ్ల మహేష్

ప్రజాశక్తి - మాచర్ల : పురపాలక సంఘంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను తొలగించటం అన్యాయమని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బండ్ల మహేష్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబుకు గురువారం వినతి పత్రం అందించారు. మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో 18 ఏళ్ల నుండి పనిచేస్తున్న ఉప్పుతోళ్ళ రమణ, పదేళ్ల నుండి పనిచేస్తున్న ఆదిరాల దిబ్బయ్య, ఏడేళ్ల నుండి పనిచేస్తున్న తురకా సాగర్‌ను కారణం లేకుండానే విధుల నుండి ఆకస్మికంగా తొలగించడం అన్యాయమన్నారు. వారిని విధుల్లోకి మళ్లీ తీసుకోవాలన్నారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న శానటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వాడితే చర్యలు

ప్రజాశక్తి - మాచర్ల : ఒక్కసారి మాత్రమే వినియోగానికి పనికొచ్చే ప్లాస్టిక్‌ను మాచర్ల పట్టణంలో నిషేధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా తెలిపారు. ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు మున్సిపల్ పర్యావరణ అధికారులు, సిబ్బంది పట్టణంలోని రిటైల్, హోల్ సేల్ షాపుల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. వ్యాపారస్తులకు ప్లాస్టిక్ నిషేధ సర్క్యులర్స్‌ను అందించారు. 120 కంటే తక్కువ మైక్రాన్లుండే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, థర్మకోల్స్ ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు, ప్లాస్టిక్ జెండాలు మొదలైన వాటిని ఒకటో తేదీ నుండి అమ్మొద్దని చెప్పారు. అమ్మిన లేదా వినియోగించినా రూ.2500-రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - వినుకొండ: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను నర్సరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు (ఎడిఎ) పి.మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని బయోస్టిమ్యులెంట్ల నాణ్యత, లైసెన్స్, లేబుళ్ల వివరాలను పరిశీలించారు. జి1, జి2, జి3 ఉన్న బయోస్టిమ్యులెంట్లను మాత్రమే రైతులకు విక్రాయించాలని, అధికార విక్రయాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొనుగోలు సందర్భంలో రైతులు కూడా లేబుళ్లను, తయారీ సంస్థ పేరును సరి చూసుకోవాలని సూచించారు. నకిలీ లేదా నాసిరకం ఉత్పత్తులను గుర్తిస్తే తమకు చెప్పాలన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

సామాన్య కుటుంబానికి రూ.73 వేల కరెంటు బిల్లు

- రేషన్ పంపిణీలోనూ అలసత్వం - రోడ్లు, వీధిలైట్లూ లేవు
- సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందం ఎదుట పలు కాలనీల ప్రజల ఆవేదన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా పట్టణంలోని గాంధీనగర్, సుందరయ్య కాలనిలో సిపిఎం బృందం గురువారం పర్యటించింది. స్థానికులతో మాట్లాడి సమ్యలను తెలుసుకున్నారు. తమ సర్వీసు ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నమోదైనా బిల్లు మాత్రం రూ.73,125 వచ్చిందని గాంధీ నగర్‌కు చెందిన గంటేలపల్లి అమరేశ్వరరావు వాపోయాడు. ఈ ప్రాంతంలో రేషన్ బియ్యం సరిగా అందడం లేదని మరికొందరు చెప్పారు. వీధిలైట్లు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నామని సుందరయ్య కాలనీ నివాసితులు వాపోయారు. 13వ తేదీ వచ్చినా రేషన్ బియ్యం ఇంకా ఇవ్వలేదన్నారు. ఎవరైనా అడిగితే.. దిక్కున్న చోట చెప్పుకోండి.. అంటున్నారని ఆవేదనకు గురయ్యారు. విద్యుత్ ప్రధాన స్తంభాలు ఇళ్లమైన ఉన్నాయని, వేరేచోటకు మార్చాలన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ ఈ సమస్యలతోపాటు కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కాలనీవాసులు గోవిందు మస్తాన్‌వలి, షేక్ సైదా, వెంకటరత్నం, షేక్ సిలర్, భూలక్ష్మి, బిబిలి పాల్గొన్నారు.



కరెంటు బిల్లును చూపుతున్న బాధితులు



కరాటే వీరుడు రోహన్‌కు సిఎం చంద్రబాబు అభినందన

ప్రజాశక్తి - వినుకొండ

కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న మండలంలోని పెదకంచర్ల గ్రామానికి చెందిన రామినేని రోహన్‌ను సిఎం చంద్రబాబు సత్కరించారు. దక్షిణాఫ్రికా రాజధాని డర్బన్ వేదికగా ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ 11వ కరాటే ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న రోహన్‌ను సిఎం చంద్రబాబు వద్దకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం తీసుకెళ్లి పరిచయం చేయగా రోహన్‌కు సిఎం జ్ఞాపికను ఇచ్చి అభినందించారు. కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరస విజయాలతో సత్తా చాటుతున్న రోహన్ డర్బన్‌లోనూ 63 కిలోల విభాగంలో స్వర్ణం గెలిచాడు. ఎలైట్ విభాగంలో స్వర్ణంతో పాటు క్లబ్స్ విభాగంలో కాంస్యం అందుకున్నాడు. సిఎంను కలిసిన వారిలో రోహన్ తండ్రి శివకృష్ణ, తాత రామకోటయ్య, పెదనాన్నలు పూర్ణచంద్రరావు, సుబ్రమణ్యం ఉన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్రంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు.

సహకార సంఘాల్లో 21 నాటికి కంప్యూటరీకరణ పూర్తవ్వాలి

- ఈ నెలలో 80 శాతం, జూన్ నాటికి నూరుశాతం ఎన్‌పిఎలను వసూలు చేయాలి
- సంఘాలు అన్ని రకాలుగా రైతులకు అందుబాటులోకి రావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పిఎసిఎస్) కంప్యూటరీకరణను ఈ నెల 20 నాటికి పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో 5వ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించగా సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. 21 నుండి జిల్లాలోని 59 పిఎసిఎస్‌లు ఈ-పిఎసిఎస్‌లుగా మారాలన్నారు. ఏ సొసైటీలోనైనా ఓచర్ జనరేషన్‌లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడాది కాలంగా సంఘాల కంప్యూటీకరణ జరుగుతున్నా పురోగతి సరిగా లేదన్నారు. సరిగా పనిచేయని సంఘ సీఈఓలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని జిల్లా సహకార అధికారి గుంటూరు కేంద్ర సహకార బ్యాంకు సిఈఓ కృష్ణవేణిని ప్రశ్నించారు. కంప్యూటీకరణ పూర్తిచేసే విషయంలో పని చేయని వారిపై ఈనెల 21న చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక సహకార సంఘాలలో జరుగుతున్న పురోగతిపై సుదీర్ఘంగా చర్చించి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కామన్ సర్వీస్ సెంటర్లుగా అన్ని సేవలు రైతులకు సకాలంలో అందించాలన్నారు. ఆధార్ ఎన్రోల్మెంట్ సిఎస్‌సి సెంటర్‌లను సిద్ధం చేయాలన్నారు. ఈపూరు, పాకాలపాడు సంఘాలలో కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సంఘాల పరిధిలోని మల్టిపర్పస్ గోదాములు ఖాళీగా ఉంచకుండా రైతుల వారి పంటలు నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటుకు ఆమోదిస్తూ పురోగతి చూపాలని సంబంధిత ఏరియా మేనేజర్లను కోరారు. అవసరమైన చోట మల్టిపర్పస్ గోడౌన్లను గ్యాస్ గోడౌన్లుగా మార్పు చేసేందుకు ఆమోదం తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఎన్‌పిఎ (నిరర్ధక ఆస్తులు) వసూళ్లను ఈ నెలలోగా 80 శాతం, జూన్ నాటికి 100 శాతం పూర్తి చేయాలని బ్యాంక్ సిఈఓను ఆదేశించారు. ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల నుండి డిసెంబర్ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, నాబార్డ్ డిడిఎం శరత్, డిఆర్‌డిఎ పీడీ హీరాలాల్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కాంతారావు, జిల్లా మత్స్య శాఖాధికారి సంజీవరావు, నరసరావుపేట డివిజినల్ సహకార అధికారి నాగ శ్రీనివాస్, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

డిఇ పరిధిలో 4814 గృహాలు మంజూరు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : గృహ నిర్మాణశాఖ డిఇ కార్యాలయ పరిధిలో 4814 గృహ నిర్మాణాలు మంజూరైనట్లు డిఇ బాలాజీనాయక్ తెలిపారు. గురువారం హౌసింగ్ కార్యాలయంలో ఏఈ సాతులూరి మరియదాసుతో కలసి డిఈ బాలాజీ నాయక్ విలేకర్లతో మాట్లాడారు. మంజూరైన గృహాలు మధ్యలో నిల్చిపోయి బేస్ మట్టం వరకు కట్టినవి, శ్లాబ్ వరకు నిర్మించి నిలిచినవి, ప్లాస్టింగ్ చేయాల్సినవి తదితర ఇళ్లను పూర్తి చేసేందుకు అదనంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వనున్నట్లు చెప్పారు. డిఇ పరిధిలో 1705 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా, బేస్మెంట్ లెవెల్ 2051, దర్వాజు దశలో11, స్లాబ్ లెవెల్‌లో 71, స్లాబ్ పూర్తి అయినవి 38 కాగా 938 గృహాలు పూర్తియినట్లు వివరించారు. స్థలం ఉండి గహ నిర్మాణం చేపట్టాలనుకునేవారు ఈ నెల 31 లోపు హౌసింగ్ కార్యాలయాల్లో కానీ, సచివాలయాల్లో కానీ తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ పెండింగ్‌లోఉన్న గృహాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న యూనిట్ అంచనా ప్రకారం ఎస్టీ, ఎస్సీ, బీసీ, లబ్ధిదారులకు మంజూరైన గృహాలకు ప్రధాన మంత్రి అవాస యోజన, అర్బన్, రూరల్, పిఎమ్ స్కీముల సంబంధించి ఎస్సీ, బీసీలకు రూరల్ ప్రాంతాల్లో రూ.1.80 లక్షలకు మరో 50 వేలు, ఎస్టీలకు మరో రూ.75 వేలు, పివిటిజిఎస్‌లకు రూ.లక్ష వరకు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదార్లు సద్వినియోగం చేసుకోవాలని బాలాజీనాయక్ కోరారు.

న్యాయవాదిపై దాడికి నిరసన



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా నూజివీడులో న్యాయవాది కొలుసు సీతారాంపై దాడిని ఖండిస్తూ సత్తెనపల్లిలో నాలుగు కోర్టుల న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ దాడిపై పోలీసులు కేసును కూడా నమోదు చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్, ఎన్నికల అధికారి జి.మార్కురావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహానాడులో కృష్ణా నదికి రిటైనింగ్ వాల్ నిర్మించాలి

సిపిఎం ప్రజాచైతన్య యాత్రకు పలు సమస్యలు తెలిపిన పేదలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న మహానాడు నదీ పరివాహక ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ఇళ్లకు ఇబ్బంది లేకుండా విజయవాడ వైపు నిర్మించినట్టు రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు సిపిఎం నాయకులు ముందు చెప్పారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాల్లో ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహానాడు ప్రాంతంలో ఉన్న స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని స్థానికులు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఇరిగేషన్, ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలి ఇప్పించే విధంగా కృషి చేయాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి



నారా లోకేష్ తాడేపల్లిప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహానాడు కృష్ణా నది ఒడ్డున రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయి అని ఇటీవల ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో వెంటనే పనులు మొదలుపెట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కార్యదర్శి వై నేతాజీ నోట్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు కొట్టే కరుణాకర్ రావు, ఎస్ గిరిజ, ఎస్ కే భాష, ఎల్ సత్యం, ఏ జగన్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి పట్టణంలోని నులకపేట శివదుర్గాపురంలో తెల్ల కోరి రోడ్డు వరకు ఆగిపోయిన సిసి రోడ్లను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. గురువారం సిపిఎం ప్రజా చైతన్య యాత్ర ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈద్గా సమీపంలోని బజార్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, సిపిఎం చొరవ జూపి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు, ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, ఏ చెరిబోర్థలోమ్, ఎన్ తులసమ్మ, వేముల వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగులపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలు కోకొల్లలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

నాగులపాడు ఎస్టీ కాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. గురువారం మండలంలోని నాగులపాడు ఎస్టీ, ఎస్సీ కాలనీలలో ప్రజా చైతన్య యాత్రలు ప్రారంభించారు. ప్రధానంగా ఎస్టీ కాలనీలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ రోడ్లమీద ప్రవహిస్తూ, తాము తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని కాలనీవాసులు తెలిపారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, అవి నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి రేషన్



నాగులపాడు ఎస్టీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కార్డులు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు ఇవ్వడం లేదని వారు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. మంచినీరు కూడా సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుండి తెచ్చుకోవాల్సి వస్తుందని చెప్పారు. తమ ప్రాంతంలోనే ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి, మంచినీటి సమస్యను తొలగించాలని కోరారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కాలనీవాసులు తెలిపారు. వాడుకునే నీరు రెండు రోజులకు ఒకసారి వదులుతున్నారని, ప్రతిరోజు వదిలే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పాశం రామారావు అన్నారు. అనంతరం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సిపిఎం బృందం పరిశీలన చేపట్టింది. విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు వెంటనే అందించాలని కోరారు. వారికి అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిరిపురంలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారము సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర జరిగింది. నాయకులు బొట్ల రామకృష్ణ గ్రామములో ప్రజలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలురైతులు సన్నకారు, భూమిలేని వ్యవసాయ కూలీలు అధికముగా వ్యవసాయాన్ని సాగు చేస్తున్నట్లు కౌలు రైతులు తెలిపారు. ప్రచార యాత్రలో పాల్గొన్న యన్ చిలకయ్య, రామకృష్ణ బృందం సభ్యులతో మాట్లాడుతు కౌలుదారు రైతులు గత 5సంవత్సరాల నుండి భూయజమాని కౌలు



గుర్తింపుకార్డుపై సంతకము చేయ్యాలనే షరతు అమలుచేయలేదన్నారు. గుర్తింపుకార్డు లేకపోవుటవలన ఆధికవడ్డీలకు, కమీషను వ్యాపారస్తులవద్ద, పురుగుమందుల వ్యాపారులవద్ద, ప్రవేటువడ్డీవ్యాపారులవద్ద, ఆధారపడ ి ఆధికవడ్డిలకు అప్పులుతెచ్చికౌలుభూమిసాగుచేస్తూన్నారు. పంటకు గిట్టుబాటుధరలు లేక తీవ్రముగా నష్టపోతున్నట్లు తెలిపారు. కౌలురైతులందరికి రుణమాఫీచేయ్యాలని, ప్రభుత్వ మార్కెట్టుల ద్వార క్వింటాలు రూ. 20 వేలకు కోనుగోలు చేయ్యాలని కోరారు. ఈ తొలకరినుండి భూయజమానితో ప్రమేయము లేకుండ కౌలు గుర్తింపుకార్డుమంజూరు చేసి, వారికిఅన్నధాత సుఖీభవ పథకముతో వ్యవసాయపెట్టుబడిఆమలుచేయ్యాలనికోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిరిపురం సచివాలయ కార్యదర్శిశ్రీవాసుకి వినతిపత్రం ఇచ్చారు.



ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతున్న పాశం రామారావు

ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పెదనందిపాడు

ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పెదనందిపాడు ఎస్సీ కాలనీకి చెందిన ఉపాధి కార్మికులను పని ప్రదేశం వద్ద కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గత 6 వారాల నుంచి కూలి డబ్బులు అకౌంట్లో పడటం లేదని వారు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు సంబంధించిన ఉపాధి కూలీలకు వేతనం బకాయిలు పెట్టడం తగదన్నారు. వెంటనే ఉపాధి కార్మికులకు కూలి డబ్బులను చెల్లించాలని కోరారు. 100 రోజుల పని దినాలు, 300 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, అకౌంట్లో పడిన నగదు వివరాల గురించి పే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. వేసవి వచ్చిన దృష్ట్యా సమ్మర్ అలవెన్సులు, మంచినీరు, మెడికల్ కిట్టు, టెంటు సౌకర్యం పని ప్రదేశం వద్ద తప్పనిసరిగా కల్పించాలన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. యూపీఏ 1 హయాంలో వామపక్షాల చొరవతోనే ఉపాధి హామీ చట్టం కేంద్రం తీసుకువచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంగళగిరి బైపాస్ రోడ్ లో శ్రీ సన్ ఫ్లవర్ హ్యాండ్లూమ్స్ షోరూం ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

మంగళగిరిని అన్నివిధాల అభివృద్ధి చేస్తాం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

కూటమి ప్రభుత్వంలో మంగళగిరిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం వీజే కాలేజీ వద్ద బైపాస్ సర్వీస్ రోడ్డులో టీటీడీ బోర్డు పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సన్ ఫ్లవర్ హ్యాండ్ లూమ్స్ షోరూమ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి చేనేత చీరను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ, చెరువు, కొండ పోరంబోకు, రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న వారికి పట్టాల పంపిణీ కసరత్తు ప్రారంభమైందన్నారు. మంగళగిరి ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రిని కార్పోరేట్ హాస్పిటల్ కు ధీటుగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్ సిద్ధమైంది. మే నెల నుంచి పనులు ప్రారంభిస్తామని, ఏడాదిన్నరలో పూర్తిచేస్తామని తెలిపారు. ఇప్పటికే ఎస్ఎల్ఎన్ పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రాజధాని అమరావతి నుంచి రోడ్ నెం.13,15ను మంగళగిరికి అనుసంధానించి ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానికిదేవి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబకు కలెక్టర్ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుండి సరళంగా సామాన్యులకు అర్ధమయ్యే విధంగా తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకురి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. గురువారం కలక్టరేట్‌లో మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి కలెక్టర్ నాగలక్ష్మీ పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రంలో డిఆర్ఓ షేక్.ఖాజావలి, కుమ్మరి, శాలివాహన సమన్వయ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు యు.వెంకటేశ్వర్లు , కుమ్మరి, శాలివాహన సంక్షేమ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.నాగేశ్వరి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భవాని తదితరులు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్ల కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్మార్ట్ మీటర్లు బిగించే కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదానీ కంపెనీ వినియోగదారుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు నియమించుకున్న టెక్నీషియన్లకు రూ.25వేలు, టెక్నీషియన్‌కు రూ.15వేలు ఇస్తామని వాగ్ధానం చేసుకున్నారన్నారు. కానీ రూ.17వేలు, రూ.8వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. తక్షణమే ఒప్పందం ప్రకారం పెండింగ్ జీతాలు చెల్లించాలని, కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిఐటియు మద్దతు ఇస్తుందన్నారు.



పరీక్షా సామగ్రి అందచేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు

పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మోటివేషన్ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బట్టీ పట్టే విధానంతో కాకుండా ఒక ప్రణాళికలతో చదువుకొని పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలని అన్నారు. అటువంటి అపారమైన శక్తి సుమేద హైస్కూల్ విద్యార్థులకు ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్‌తో పాటు పరీక్ష ప్యాడ్స్, పెన్ను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న దీప్తి నందమూరి

ఎసిఎంఇ స్కూల్ డైరెక్టర్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

ఎసిఎంఇ స్కూల్ డైరెక్టర్ దీప్తి నందమూరి బ్రెయిన్ ఫీడ్ ఎగ్జాప్లే ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు-2025 అందుకున్నారని స్కూల్ డైరెక్టర్ సౌగంధ్ కృష్ణనందమూరి తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐఐటి మద్రాసు ఇంక్యుబేషన్ సెంటర్‌లో అవార్డును బహుకరించినట్లు చెప్పారు.

యువతకు, విద్యార్థులకు కవయిత్రి మొల్ల మాంబ జీవితం ఆదర్శం

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత విద్యార్థిని విద్యార్థులు స్ఫూర్తి పొందాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. గురు వారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాలులో కవియిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారంగా నిర్వహిం చేందుకు ఆదేశాలు జారీ చేసి ఉందన్నారు. రామా యణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా తక్కువ వ్యవధిలో రచించిన గొప్ప కవయిత్రి అని కొని యాడారు. మారుమూల ప్రాంతం నుండి నుండి వచ్చిన కవియత్రి అని ఆమె పేరుతో ప్రభుత్వం స్టాంప్ కూడా రిలీజ్ చేసిందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కుమ్మరి నాయకుల కోరిన విధంగా ప్రభుత్వ నియమ నిబంధన అనుసరించి మట్టిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని కోరారు. మట్టిని ఎవరు తీసుకెళ్తున్నారు అనేదానిపై నిఘా ఉంచాలని అన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి మురళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు పలువురు సంఘ నాయకులు శ్రీనివాసులు, బసవేశ్వర రావు, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మంగమ్మ పాల్గొన్నారు.



సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జెసి సూరజ్ ధనుంజయ్



సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జెసి సూరజ్ ధనుంజయ్

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో చౌక దుకాణాల ద్వారా సరఫరా అవుతున్న సరుకుల పంపిణీపై జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎండియు వాహనం దగ్గర నిలుచొని సరుకుల సరఫరా ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి వాహనంలో ఉన్న నిల్వాలు, నిల్వాల రికార్డులను తనిఖీ చేశారు. పంపిణీ వ్యవస్థ తీరు, సరుకుల నాణ్యత తదితర అంశాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డిఓ కె.మధులత, తహశీల్దార్ కె. వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ఆట వస్తువులు వితరణ చేసిన చిలమకూరి నాగిరెడ్డి

పాఠశాలకు ఆట వస్తువులు వితరణ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చిలమ కూరి నాగిరెడ్డి తన తల్లిదండ్రులు నారాయణరెడ్డి, సుబ్బమ్మల జ్ఞాపకార్థం మాచర్ల మండల పరిధిలోని కంభంపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 12 వేల రూపాయల విలువైన ఆటవస్తువులను బహుకరించారు. మదర్ థెరీసా సేవా సమితి అధ్యక్షులు గాదే కిరీటి రెడ్డి మాట్లాడుతూ మదర్ తెరిసా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సేవాసమితి సభ్యులు సమాజంలో అట్టడుగు వర్గాల వారికి సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ జక్కిరెడ్డి మర్రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. విజయకుమారి, మొరా భాస్కర రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్ ఎరబోతుల శ్రీనివాసరావు, తుమ్మ ఆంథోనిరెడ్డి, కె. శాంతిరెడ్డి, ఎం.పాపిరెడ్డి, కర్తయ్య, షేక్ జబ్బారు, తెడ్ల మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

శాసనమండలిలో వైద్యమిత్రల సమస్యలను ప్రస్తావించిన కెఎస్ లక్ష్మణరావు

కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి

ప్రజాశక్తి - వినుకొండ

శాసనమండలిలో వైద్యమిత్రల గురించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు గురువారం ప్రస్తావించినందుకు వారికి రాష్ట్రంలోని వైద్య మిత్రాలందరి తరపున మాచర్ల బుజ్జి ధన్యవాదములు తెలిపారు. మాట్లాడేటప్పుడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ శాసనమండలిలో ఉండటం ప్రభుత్వం దృష్టికి వెళ్ళటం మంచి పరిణామమని అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న వైద్య మిత్రాల గురించి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చక్కగా వివరించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య బీమా విధానంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలను కొనసాగించాలనీ, 17 సంవత్సరాల సర్వీసును గుర్తిస్తూ కాంట్రాక్టు విధానంలో మార్చాలని సమాన పనికి సమాన వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడటం హర్షించ తగ్గ విషయ మని ఆంధ్ర ప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే అన్ని విధాల సహకరించి మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

పెరిగిన ఎండ తీవ్రత - తగ్గిన జన సంచారం



ఉదయం 11 గంటల తర్వాత తగ్గిన జనసంచారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఫిబ్రవరి నెలలోనే బానుడు భగభగలు తారా స్థాయికి చేరాయి. పట్టణంలో ఎక్కడా చెట్లు లేకపోవడంతో ఎండవేడిమి ఎక్కువగా కనిపిస్తోంది. మును పెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఎండలు ఫిబ్రవరి రెండో వారంలోనే కొద్దిపాటి వడగాలులతో కూడిన ఎండలు మొదలై ప్రస్తుతం తీవ్రత పెరిగింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురువారం అత్యధికంగా 30 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ ధాటికి మధ్యాహ్నం 12 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాల వ్యాధులు, స్థూల కాయం ఉన్నవారు. మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. పశు కాపరులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఇంట్లో ఉక్క పోతను తప్పించుకోవాలంటే ఇంటిపైన కూల్ నిచ్చే సున్నం లాంటివి వేయించుకోవాలంటు న్నారు. తప్పని సరిగా బైట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలనీ, గొడుగు వాడాలని, రోజుకు 5,6 లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, మజ్జిగ, కొబ్బరినీళ్ళు తాగాలని, వీలైనంత వరకు కాటన్ దుస్తులు ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మాచర్లలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి

రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ పి.మధు కుమార్

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు గుంటూరు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ పి.మధు కుమార్ తెలిపారు. గురువారం మాచర్ల పురపాలక సంఘం టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని రోజు వారి టౌన్ ప్లానింగ్ సేవలను ఆయన పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పోలూరి నరసింహరావు, కమిషనర్ డి.వేణుబాబు పట్టణ అభివృద్ధి పనులు గురించి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌తో మాట్లాడటం జరిగింది. మాయాబజార్ షాపరూమ్‌ల నిర్మాణం, బస్టాండ్ వద్ద, సాగర్‌రోడులో నూతన షాపులు నిర్మించి పురపాలక సంఘం అభివృద్ధిపై చర్చించారు. గుంటూరు రోడ్డు వెంబడి ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్ యూజ్ గురించి, ప్లాన్ అనుమతులకు ఆటంకంపై, నూతన మాస్టర్‌ప్లాన్ అనుమతిపై చర్చించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలు, లైసెన్స్డ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



మధు కుమార్‌ను సన్మానిస్తున్న చైర్మన్ నరసింహారావు

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతి



మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న బిసీ నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కవయిత్రి మొల్లమాంబ 585 వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణం లోని రైల్వేగేటు వద్ద బీసీ సంఘం నాయకులు మోదుగుల బాబ్జీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వ హించారు. బీసీ సంఘాల నాయకులు మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ ఆనాటి కాలంలో మహిళలలో అభ్యుదయ భావాలు కల్గించిన మాతృమూర్తి మొల్లమాంబ ఆని కొని యాడారు.స్పందించే హృదయం ఉంటే చాలు సాహిత్యంలో స్త్రీలు కూడా తక్కువ కాదని నిరూపించిదన్నారు. కార్యక్రమంలో గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, పిక్కిలి శివ, యర్రగొర్ల శ్రీనివాస్, ఒంటి పులి అరుణ్ కుమార్, చింకా అంకమ్మరావు పాల్గొన్నారు.



పెద్దకూరపాడులో

ప్రజాశక్తి - పెదకూరపాడు

కవయిత్రి మొల్ల రచనలు సమాజానికి ఆదర్శమని పెదకూరపాడు అభివృద్ధి వేదిక ప్రతినిధులు తెలిపారు. గురువారం పెదకూరపాడులోని కచేరి సెంటర్లో మొల్ల జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజాకవి దర్శి శేషారావు,మాజీ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాల్రావు,మాజీ ఎంపీపీ గళ్ళా బాబురావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ మన్నవ వీరయ్య, పెదకూరపాడు ఉప సర్పంచ్ జాగర్లమూడి రఘుపతిరావు,కాల్వ అప్పారావు, టీచర్ సాంబశివరావు, టీచర్ రాధాకష్ణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మల్లు,నరసింహారావు, సంజీవరావు పాల్గొన్నారు.



పరీక్ష సామాగ్రి పంపిణీ చేస్తున్న జ్ఞానేశ్వరరావు

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి-ఈపూరు

చదువుతూనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఏజిపి ఎం జ్ఞానేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని చదివితే భవిష్యత్తులో మంచి స్థానాలు పొందుతారన్నారు. చదువుతో పేదరికం జయించవచ్చని, చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావు, ఫౌండేషన్ ప్రెసిడెంట్ పమిడిపల్లి అనిల్ రాజ్, సభ్యులు మనోహర్, రత్నరాజు, కె సునీల్, వెంకట్రావు పాల్గొన్నారు.



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న కేదారి రమేష్

10వ తరగతి విద్యార్థులకు పెన్నులు అందజేత

ప్రజాశక్తి - రాజుపాలెం

ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కేదారి రమేష్ కేదారి ఛారిటబుల్ ట్రస్టు తరుపున విద్యార్థులకు పెన్నులను ఉచితంగా అందించినారు. విద్యార్థులు ఈ సంవత్సరం మండలం ఫస్ట్ సాధిస్తే 5000 రూపాయలు బహుమతి ఇస్తానని ప్రకటించి విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సంఘం తరుపున పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రమేష్‌కి పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయురాలు పి శైలజ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఎస్.శివబాబు, సునీల్‌దత్, విద్యార్థులు ఉన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీవో బి శ్రీనివాస్ రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండల స్థాయి అధికారులు వారిశాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. గౌరవ సర్పంచులు ఎంపీటీసీలు కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

నందివెలుగు-గుంటూరు రోడ్డు నిర్మాణం ప్రారంభం

తెనాలి ఆర్ అండ్ బి పరిధిలో రూ.3.30 కోట్ల అంచనాలతో పనులు



గుంతలు పూడ్చిన నందివెలుగు గుంటూరు రోడ్డు

సమస్యాత్మకమైన రోడ్లను చక్కదిద్దే పనిలో ఆర్ అండ్ బి అధికారులు నిమగ్నమయ్యారు. గత ఐదేళ్ల కాలంలో ప్రధానమైన రోడ్లు సైతం నిర్లక్ష్యానికి గురైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రధానంగా రోడ్ల మరమ్మతులు, నిర్మాణంపై దృష్టి సారించింది. ముఖ్యంగా తెనాలి ఆర్ అండ్ బి పరిధిలో నందివెలుగు - గుంటూరు మార్గంలో నందివెలుగు నుంచి జాకీర్ హుస్సేన్ నగర్ వరకు రోడ్డు మరీ దయనీయంగా మారింది. రూ.3.30 కోట్ల అంచనా వ్యయంతో ఆర్అండ్ బి అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రజాశక్తి తెనాలి

తెనాలి రోడ్లు భవనాల శాఖ పరిధిలో ప్రధానమైన రోడ్లన్నీ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కనీసం ప్యాచ్ వర్క్‌లకు కూడా నోచుకోకపోవడంతో రోడ్లు మరింత దిగజారాయి. తెనాలి-నందివెలుగు, నందివెలుగు జాకీర్ హుస్సేన్ నగర్, తెనాలి- నారాకోడూరు, తెనాలి- మంగళగిరి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. నందివెలుగు నుంచి గుంటూరు వెళ్లే మార్గం మరీ అధ్వానంగా ఉంది. తెనాలి ఆర్ అండ్ బి పరిధిలో జాకీర్ హుస్సేన్ నగర్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు కూడా తక్కువ కావడంతో ఆటోల తాకిడి అధికంగా ఉంది. ప్రాణాలు అరచేత పట్టుకొని ప్రజలు ప్రయాణించేవారు. పలుసార్లు ఆటోలు, ద్విచక్ర వాహనాలు తీవ్ర ప్రమాదాలకు గురైన సంఘటనలు లేకపోలేదు. ప్రస్తుతం ఆర్ అండ్ బి అధికారులు తాజాగా ముందు ప్యాచ్ వర్క్ పూర్తి చేశారు తర్వాత నిర్మాణం కూడా చేపట్టనున్నారు. జెసిబి సాయంతో గుంతలు సరి చేశారు. దీనికోసం రూ 3.30 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ఏప్రిల్ ఆఖరులోగా రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చని అధికారులు చెబుతున్నారు.

హాఫ్ పేటలో దెబ్బతిన్న వంతెన..

ఈ మార్గంలో హాఫ్‌పేట గ్రామంలో ఇరిగేషన్ కెనాల్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు చెబుతున్నారు. ఈ మార్గంలో ఇసుక టిప్పర్లు, ఇటుక లారీలు అధిక లోడుతో ప్రయాణిస్తూ ఉంటాయి. గతంలో వంతెన ప్రమాదకర స్థితిలో ఉందని అధికలోడుతో ఉన్న వాహనాలు ప్రయాణించకూడదని ఆర్అండ్‌బి అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. తర్వాత ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా వదిలేసారనీ ఏళ్ల తరబడి వంతెన నిర్లక్ష్యానికి గురవుతోందని గ్రామస్తులంటున్నారు. ఆకస్మికంగా వంతెన దెబ్బతింటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనీ, రోడ్డు నిర్మాణంలో భాగంగానైనా వంతెన పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



హాఫ్ పేటలో శిథిలావస్థలో ఉన్న వంతెన

ఏప్రిల్ నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి

నందివెలుగు జాకీర్ హుస్సేన్ నగర్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాం. రూ.3.30 కోట్ల అంచనా తో ప్రారంభించిన పనులు ఏప్రిల్ నాటికి పూర్తి అవుతాయి. తొలుత రోడ్లపై ఉన్న గుంతలను సరిచేశాం. అక్కడక్కడ ప్యాచ్ వర్క్ కూడా చేశాం. క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ అనంతరం బీటీ లేయర్ తో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఈ మార్గంలో దెబ్బతిన వంతెన విషయానికి వస్తే దానికి ప్రత్యేక అంచనాలతో ప్రతిపాదించాం. ప్రభుత్వ ఆమోదం లభించాల్సి ఉంది.

రాజేంద్ర నాయుడు, డిఈ, ఆర్అండ్‌బి తెనాలి

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి తెనాలి

డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూరల్ గ్రామం కాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం జామెంట్రీ బాక్స్, పాడ్, పెన్నులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజీవ్ నాయక్ మాట్లాడుతూ 'పే బ్యాక్ టు ది సొసైటీ' యువకులు స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సంస్థ కార్యదర్శి దేవరాజ్ మాట్లాడుతూ 2019లో సంస్థ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎం.రాజ్‌కుమార్ ఉపాధ్యాయులు ఎస్.కె. ఎండి రవూఫ్, ఆదిలక్ష్మి, స్థాని కులు ఎస్ వినయ్‌కుమార్, సిహెచ్ నాగరాజు, సభ్యులు జ్యోత్స్న, షేక్‌సాహెబా, జి.అనుపమ్, పాల్గొన్నారు.

20 నుంచి స్వఛ్ తెనాలి ఛాలెంజింగ్ పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 22 వరకు పట్టణంలోని 40 వార్డులలో మూడురోజులపాటు వార్డ్ శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శులకు స్వచ్ తెనాలి ఛాలెంజింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బి. శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను వేరు చేయుట, రోడ్డుమీద వ్యర్థాలు మేట వేయకుండా చూడటం, శానిటరీ సిబ్బంది హాజరు శాతం ఖచ్చిత పరిశీలన, పారిశుధ్యంపై ప్రజల స్పందన, పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో యూనిఫామ్ ధరించ ఎవల్యూషన్ కమిటీ పరిశీలిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కింద రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు ఇస్తారని తెలిపారు.

నేడు బౌద్ధ జ్ఞాన దీపోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : మల్లెపాడులోని బౌద్ధ క్షేత్రం వద్ద ఉదయం 10 గంటలకు బౌద్ధ జ్ఞాన దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు బౌద్ధ భిక్షువు, న్యాయవాది గుంటి సురేష్ బాబు గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ శ్రీలంక బౌద్ధ బిక్షవు బోధిహీను హాజరవుతారని చెప్పారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు 13వ తేదీ వచ్చినా ఇప్పటి వరకూ జీతాలు చెల్లించలేదని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్, జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పవన్, జి.నాగరాజు కోశాధికారి కె.రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీతాలు అందక కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్కువ జీతాలతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు అవి కూడా సకాలంలో ఇవ్వట్లేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ఈపిఎఫ్, ఈఎస్ఐ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల అధ్య క్షులు చల్లగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన మొల్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాలివాహన సంఘం జిల్లా యువజన అధ్యక్షులు మామిళ్ళపల్లి సుబ్బారావు విచ్చేసి మాట్లాడుతూ తొలి తెలుగు మహిళా కవయిత్రిగా మొల్ల అనేకమంది మహిళ లకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారికంగా ప్రకటించినా, ప్రభుత్వ కార్యాలయాలలో జయంతి వేడుకలు జరపకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నిజాంపట్నం సుబ్బారావు, చల్లగిరి సామ్రాజ్యం, నాగేశ్వర రావు, నిజాంపట్నం శివాజీ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు



'మొల్ల'కు నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం సభ్యులు

సమాచార హక్కు చట్టానికి పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ తూట్లు

ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రభుత్వాలు తమ పాదదర్శకతను ప్రజలకు తెలిపి వారు అడిగిన సమాచారం పూర్తిగా ఇచ్చేందుకు ఏర్పాటు చేసిందే సమాచార హక్కు చట్టం. అయితే అది పెదకాకాని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అమలు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదకాకానికి చెందిన ఓ న్యాయవాది ఈ సంవత్సరం జనవరిలో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమారచార హక్కు చట్టం కింద వివరణ కోరగా సబ్ రిజిస్టర్ సరైన సమాచారం ఇవ్వకపోగా అసలు సమాచారాన్ని దాచి పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. న్యాయవాదికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే సబ్ రిజిస్టర్‌కు ముడుపులు అందితే గ్రామకంఠాలను సైతం పూర్వీకుల ఆస్తిగా రిజిస్ట్రేషన్ చేసిన సంఘనలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల్లో ఉండవలసిన అటెండర్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు రాదో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రిపూట విధులు నిర్వహించవలసిన పెట్రోల్ సిబ్బంది జాడ కనిపించదు.. కానీ రిజిస్టర్ ఆఫీసులోని అన్ని రిజిస్టర్లలో సక్రమంగా నమోదవుతాయి. హెచ్ఆర్‌సి ప్రకారం కార్యాలయం పరిధిలో నివాసం ఉండవలసిన ఉద్యోగులు వారి నివాసాలు కాగితాలకి పరిమితం చేస్తున్నారు. ఇక అనధికారిక డిప్యూటేషన్లు ఈ కార్యాలయంలో షరా మామూలే. ఇంత జరుగుతున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై దృష్టి పెట్టకపోవడం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకతను అమలు చేయాలని కోరుతున్నారు.




వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - తాడికొండ

అందరప్రదేశ్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం గుంటూరు వైద్య కళాశాల సామాజిక వైద్య విభాగం సహకారంతో రిజినల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో చర్మ వ్యాధి నిపుణులు, దంత వైద్య నిపుణులు పాల్గొని 152 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించి, వ్యాధుల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగారావు, అసోసియేట్ ప్రొఫెసర్ సామాజిక వైద్య విభాగం డాక్టర్ తేజ్ కుమార్, డా॥నళినీ దేవి, డాక్టర్ కమలశ్రీ, నిర్మల, చంద్రబాబు, మణికుమార్ పాల్గొన్నారు.



మోజెస్‌ను అభినందిస్తున్న సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్

కెఎల్‌యు విద్యార్థికి భారతీయ అమృత్ మహోత్సవ్ - 2025 అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఫార్మశీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాంబీయాకు చెందిన మోజెస్ అనే విద్యార్థి భారతీయ అమత్ మహెూత్సవ్ -2025 అవార్డుకు ఎంపికయినట్లు సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ గురువారం తెలిపారు. ముంబైలోని అంధేరీ వెస్ట్‌లో ఈనెల 13న అంతర్జాతీయ స్థాయిలో షీబా మీడియా వర్క్ షాప్ వారు నిర్వహించిన ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. ముంబై హాస్టల్ ఎడిటర్ దిల్షాద్ ఎస్. ఖాన్, ప్రముఖ సెలబ్రిటీ యాంకర్, మిస్ ఇండియా, నటి, టివి టాక్ షో హెూస్ట్ సిమ్రాన్ అహుజాతో సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కెఎల్ సాక్ విబాగంలోని ఫ్యాషన్ అనే క్లబ్ కు చెందిన మోజెస్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్ షోలో పాల్గొని అవార్డు సాధించడం గర్వంగా ఉందని సాయి విజయ్ అన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రోవైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విబాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్‌పాల్గొని మోజెస్‌ను అభినందించారు.



ప్లాస్టిక్ నిర్మూలనపై పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

"స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" అమలులో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర" డే సందర్భంగా గురువారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో క్యారి బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, టీ కప్పులపై అవగాహన కల్పించేందుకు పరీక్ష నిర్వహించారు.

మాణిక్యవేల్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతి సోప్‌వర్క్స్ అధినేత మాణిక్యవేలు మృతికి సిపియం సంతాపం తెలిపింది. ఈ మేరకు సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్‌లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాణిక్యవేలు సాధారణ కుటుంబం నుండి వచ్చి, అంచెలంచెలుగా ఎదిగి, తన సంస్థలను విస్తరింప చేశారని, వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించారన్నారు. అధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించి తన మానవతాదృక్పధాన్ని, సామాజిక బాధ్యతను నెరవేర్చారన్నారు. వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

కిమ్స్ హాస్పిటల్‌లో కిడ్నీ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

సైలెంట్ కిల్లర్‌గా వ్యాపిస్తున్న కిడ్నీ సంబంధ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, తరచూ కిడ్నీ వైద్య సంబంధ పరీక్షలు చేయించుకోవడం, ప్రాథమిక దశలోనే కిడ్నీ సంబంధ వ్యాధులను గుర్తించడం వల్ల క్రానిక్ కిడ్నీ జబ్బుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు అని కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వి.శరత్‌చంద్ర, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్ అన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం మంగళ దాస్‌నగర్‌లోని కిమ్స్ హాస్పిటల్లో ఉచిత మెగా కిడ్నీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పదిమందిలో ఒకరు దీర్ఘకాలిక కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతుంటే మన దేశంలో 10 లక్షల మందిలో 800 మంది కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నారని, క్రానిక్ కిడ్నీ జబ్బులతో 150 నుంచి 200 మంది బాధపడుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ 'మీ కిడ్నీలు బాగున్నాయా ముందుగానే గుర్తించండి, కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడండి' అనే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ థీమ్ తో గుంటూరు కిమ్స్ హాస్పిటల్‌లో ఉచిత కిడ్నీ వైద్య శిబిరం నిర్వహించి జి.ఆర్.బి.ఎస్, సీరం క్రియాటిన్ కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ పరీక్షలు నిర్వహించి నెఫ్రాలజీ యూరాలజీ డాక్టర్ల కన్సల్టెన్సీ సేవలను ఉచితంగా అందజేశారు.

గుండె ఆరోగ్యాన్ని కనుగొనే సాఫ్ట్‌వేర్ సృష్టికర్త

సిద్ధార్థ్‌కు జిజిహెచ్ సూపరింటెండెంట్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు



సిద్ధార్థ్‌ను అభినందిస్తున్న డాక్టర్ రమణ యశస్వి

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి సిద్ధార్థ్ అనే 14 ఏళ్ల బాలుడు తయారు చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా గుండె చప్పుడును బట్టి గుండె ఆరోగ్యాన్ని కనుగొనే పరీక్షను గురువారం జిజిహెచ్‌లోని పలువురు రోగులకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ సిద్ధార్థ్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో అమెరికాలో 14వేల మంది అమెరికా పౌరులపై రీసెర్చ్ చేశారన్నారు. మాతృభూమి అయిన భారత దేశంలో కూడా ప్రజలకు ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోపగపడాలనే ఉద్దేశంతో జిజిహెచ్‌లో కూడా రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. సిద్ధార్థ్ జిజిహెచ్‌లో రోగులపై తాను చేసిన రీసెర్చ్ గురించి మాట్లాడుతూ ఐదుగురికి గుండె చప్పుడు ఆధారంగా గుండె సంబంధిత రోగం ఉన్నట్లు గుర్తించటం జరిగిందని, అందులో నలుగురు కార్డియాలజీ విభాగంలో ఓపికి తీసుకెళ్లగా, వారికి ఉన్న గుండె సమస్య నిజమేనని తేలిందన్నారు. ఈ సందర్భంగా బాలుడి ప్రతిభా పాటవాలను డాక్టర్ రమణ యశస్వి అభినందించి సత్కరించారు.

టిజెపిఎస్‌లో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపిఎస్ కళాశాలలో రెండ్రోజులపాటు 'భారతదేశ గ్రామీణాభివద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, అంకుర పరిశ్రమల పాత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఆర్.శివరామ్‌ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ నేటి విద్యార్థులు మంచి సజనాత్మకతతో ఆలోచించి, రాబోయే రోజుల్లో గొప్ప వ్యాపారవేత్తలుగా ఎదగాలని అన్నారు. అంతే కాకుండా గ్రామాలను దత్తత తీసుకుని వాటి అభివద్ధిలో పాలు పంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పరిశోధనా పత్రాలు సమర్పించిన అధ్యాపకులకు, పరిశోధనా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.ఆర్.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితాదేవి, సదస్సు సంచాలకులు డాక్టర్ ఉప్పు.రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.

నాటుసారా నివారణకు డ్రోన్ల ద్వారా నిఘా

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో నాటు సారా తయారీని అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాలలో డ్రోన్ల ఉపయోగించి పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, అటవిశాఖ అధికారులను ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్ లో నవోదయం 2.0 కార్యక్రమంపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నాటు సారా తయారీని లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించడంతో పాటు నాటు సారా వినియోగం వలన ఆరోగ్య పరంగా వచ్చే సమస్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నాటు సారా తయారు చేస్తున్న వారిని గుర్తించి, ప్రభుత్వం అందించే సంక్షేమ శాఖల పథకాల సహాయంతో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపించాలని తద్వారా నాటు సారా తయారి నివారించాలన్నారు. నాటు సారా తయారీ, వినియోగాన్ని నిరసిస్తూ నవోదయం 2.0 పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ కె.మణికంఠ, సిఐ సోమయ్య, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

10 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2024 - 25 సంవత్సరానికి సంబంధించి పల్నాడు జిల్లాలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్. చంద్రకళ తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఇఒ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థినీ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 463 పాఠశాలల నుంచి 26,497 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, అందులో 13,415 బాలురు, 13,042 బాలికలు ఉన్నారని అన్నారు. జిల్లాలో మొత్తం 128 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, అందులో 60 ప్రభుత్వ, 68 ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, నిరంతరం విద్యుత్ సరఫరా మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రాథమిక చికిత్స అందించేందుకు ఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. 95523 00009 నంబర్ నుండి హాల్ టికెట్లను ఇంట్లో ఉండే డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. ఒక గంట ముందే పరీక్షా కేంద్రం వద్దకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్ చూపించి ఆర్టీసి బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలో మొత్తం 6 సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ఓపెన్ 10వ తరగతి పరీక్షల కోసం 27 సెంటర్లలో, 1200 మంది విద్యార్థులు రాస్తున్నారని తెలిపారు. మొత్తం 6 ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఓపెన్ టెన్త్ ఎగ్జామ్స్ సెంటర్లలో ఇద్దరు స్క్వాడ్లు, 1650 మంది ఇన్విజిలేటర్స్ ను నియమించామని పరీక్ష విధానాన్ని పరిశీలించేందుకు 280 మంది చీఫ్ సూపరింటెండ్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎస్.ఎస్.సి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే సెల్ నంబర్ 83411 35357 సంప్రదించాలన్నారు.

ప్రపంచం చూపంతా భారత్ స్టాక్ మార్కెట్ల వైపే

ఎన్ఎస్ఎ డిప్యూటీ మేనేజర్ జి.రవిరాజు



ఎన్ఎస్ఎ డిప్యూటీ మేనేజర్ జి రవిరాజును సన్మానిస్తున్న వర్సిటీ ఆచార్యులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారత స్టాక్ మార్కెట్లు ఎంత కఠిన నిబంధనలను పాటిస్తున్నప్పటికీ అమాయకపు మదుపుదారుడు మోసపోతూనే ఉన్నాడని నేషనల్ స్టాక్స్ ఎక్స్చెంజ్ డిప్యూటీ మేనేజర్ గుంటూరు రవిరాజా చెప్పారు. గురువారం ఉదయం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనాన్షియల్ ప్లానింగ్ అండ్ సెక్యూరిటీస్ మార్కెట్- పర్సొనేషన్ అండ్ ఫ్రాడ్స్ అనే అంశంపె ప్రొఫెసర్ ఎన్ రంగయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సదస్సులో రవిరాజా మాట్లాడుతు భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్నారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న భారత్ నాలుగో స్థానానికి ఎగబాకటాన్ని బట్టి చూస్తే మన ప్రభుత్వం తీసుకునేటువంటి చర్యలు ఎంత గొప్పవో గమనించాలన్నారు. మన ఖాతాలను ఖాళీ చేసే మోసగాళ్ల బారిన పడకుండా ప్రభుత్వం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ముఖ్యంగా మొబైల్స్ ద్వారా చైతన్య పరచటం మంచి విషయమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి తన సంపాదనలో పొదుపు వలన కలిగే ప్రయోజనాలు, మెరుగైన అర్జన పొందటానికి క్యాపిటల్ మార్కెట్ ఎలా దోహదం చేస్తుందో వివరిం చారు. అంతేకాకుండా మోస పూర్తి చర్యల ద్వారా మధుపరులు నష్టపోకుండా సెబిలాంటి రెగ్యులేటరీ బాడీస్ ఏ విధంగా చైతన్యం చేస్తున్నాయో సత్వర పరిష్కారానికి ఏమేమి చర్యలు తీసుకుంటున్నాయి వివరించారు. రెక్టర్ రత్నషీలామణి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మంచి జీవితం కోసం అలాగే అధిక ఆదాయం కోసం అనేక దారులు చూస్తుంటాడని అందులో ఒక భాగం షేర్ మార్కెట్ అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ జి సింహాచలం మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు కామర్స్ విద్యార్థులతో పాటు న్యాయ సూత్రాల కారణంగా ఇటు న్యాయ విద్యార్థులకు సంబంధం కలిగి ఉండటం వలన వారందరికీ ఎంతో ప్రయోజనం అన్నారు. తనకి ఈ చట్టాల పట్ల అవగాహన లేకపోయినప్పటికీ సరదాగా చేసిన పని కారణంగా గతంలో తాను లాభాలు పొందలేక ఈ మార్కెట్ కి దూరంగా ఉండవలసి వచ్చిందని తన స్వీయ అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచమంతా ఎన్నో సందర్భాలలో ఆర్థిక ఒడిదడుగులు వచ్చినప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం కుదేలు కాకుండా ఉండటానికి భారతీయ ప్రజల సంప్రదాయాలే ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ మెంబర్ గంటా సురేష్‌కుమార్, న్యాయవిభాగపు అధ్యాపకసిబ్బంది డాక్టర్ పి వెంకటరమణ, డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, బివి చెన్నారావు, అభిలాష్ గోపీనాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాలలోని 36 మంది విద్యార్థులకు రూ.3.6 లక్షల ప్యాకేజితో ఉద్యోగాలు లభించాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ కంపెనీలు తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు 654 మంది ఉద్యోగాలు పొందారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

చలపతిలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న అతిథులు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన 'ట్రాన్స్ఫార్మింగ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ అండ్ ఫార్మకో ఎకనామిక్స్ త్రు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. రెండోరోజు పలు సైంటిఫిక్ సెషన్స్‌తో, కళాశాల 21వ వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాట్కో ఫార్మా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ వీరనారాయణ అడ్డగడ్డ, ఆంధ్రప్రదేశ్ ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ హార్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ కన్వీనర్ ఎస్.వి.ఎస్ లక్ష్మీనారాయణ, కెన్యా హెచ్ అండ్ మోర్ కె లిమిటెడ్ సిఎస్ఓ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.హేమంత్‌కుమార్, సూర్యాపేట వికాస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆడెపు , సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్, హైదరాబాద్ సాండోస్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్ మేనేజర్ జడా నలిని హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిథులు స్టూడెంట్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. బెంగళూరు ఆక్సోక్రోమోఫోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో-ఫౌండర్ శ్రేయస్ బుర్జి చలపతి ఫార్మసీ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరనారాయణ అడ్డగడ్డ మాట్లాడుతూ ఫార్మసీ రంగం అనేది కేవలం ఒక కోర్సు మాత్రమే కాదని, అది మానవ సేవకు నడిపించే ఒక యంత్రం వంటిదని చెప్పారు. ఫార్మసిస్టులు ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వైవి ఆంజనేయులు గోల్డ్ మెడల్, అనంత కుమారి గోల్డ్ మెడల్‌లను అందజేశారు. కార్యక్రమంలో సుచిత్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.